THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
## సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతిరోజు మధ్యాహ్నం 2-30 గం॥లకు

**హిందీ — SATYA SUSAMACHAR**

| | |
|---|---|
| మంగళవారము<br>గురువారము<br>శుక్రవారము | 9.00 to 9-15 p. m. |
| శనివారము | — 1-45 to 2-00 p. m. |

**ఇంగ్లీషు — The Voice of Truth**

ఆదివారము —9-30 to 9-45 p. m.
మంగళవారము — 9-30 to 9-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము — 6-45 to 7-00 p. m.
శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మళయాళం — The Voice of Truth**

మంగళవారము — 3-45 to 4-00 p. m.
శుక్రవారము — 3-45 to 4-00 p. m.

---

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.


**SATYA VANI**
P. O. Box 80, KAKINADA-533 001


---

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE
*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity

సంచిక **2** | సెప్టెంబరు **1981** | సంపుటి **2**

# సంపాదకీయము

## నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా?

*( Are you a member of the Church of Christ? )*

నేడు లోకమందు అనేక సంఘము లున్నవను సంగతి మనందరకు విదితమే. వాటిలో ప్రతి యొకటి సరియైనదే యని ఆరోపించుకొనుచున్నది, అయితే వాటిలో యేది సరియైనది? ప్రభువుకు ఒక్క సంఘమే యున్నదా లేక అనేక సంఘములున్నవా? క్రైస్తవ్యము పేరట చెలామణి యగుచున్న వాటన్నిటిని ఆయన ఆమోదించునా? క్రీస్తు విభజింపబడి యున్నాడా?

### సంఘమునకు నిర్వచనము

సంఘము అనగా పదార్థసంబంధమైన భవనమని మానవుడు తలంచుచున్నాడు. గాని బయటకు పిలువబడిన విశ్వాసుల సమూ

హము, రక్షణ పొందినవారు, క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరము అని లేఖనములయందు ప్రభువు సంఘము వర్ణింపబడినది (1 పేతురు 5:10; అపొ. కా. 2:42; 1 కొరింథీ 12:27). సంఘము దాని సభ్యులు క్రీస్తు నామమునే ధరింతురు. వేర్వేరు ప్రాంతములలో యున్న స్థానిక క్రీస్తు సంఘములను గూర్చి చెప్పుచు, పౌలు ఇట్లనెను: "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16). క్రీస్తు సంఘ సభ్యులై, ఆయనను వెంబడించిన వారందరు క్రైస్తవులని అపొ. 11:26, 26:28; 1 పేతురు 4:16 నందు పిలువబడిరి.

## సంఘము ఒక్కటే

క్రీస్తు ఒకే ఒక సంఘమును కట్టెను (మత్తయి 16:18). అది యెరూషలేము పట్టణమందు యించుమించు క్రీ॥శ॥ ౩౩వ సం॥లో ఆరంభమాయెను (అపొ. 2). ఆత్మావేశ లేఖకుడు ఎఫెసీ 4:4 నందు "శరీర మొక్కటే" యని చెప్పెను. ఈ శరీరము యేమై యున్నది? ఆ క్రైస్తవులతో అదే లేఖకుడు క్రీస్తును గూర్చి యిట్లు చెప్పుచున్నాడు: "సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22, 23). క్రీస్తును గూర్చి కొలస్సయిలో యున్న సోదరులకు యిట్లు చెప్పుచున్నాడు: "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" (కొలస్స 1:18). ఈ వచనములన్నియు మన కేమి బోధించుచున్నవి? ఒకే శరీర మున్నదని, ఆశరీరమే సంఘమని, సంఘమే శరీరమని తెలుసుకొని యున్నాము. శరీరము ఒక్కటే, అదియే సంఘమై యున్నది. గనుక సంఘము ఒక్కటే. ఒక్కటేయైన

ఆ సంఘము ఏది? మనము ఇంతకు ముందు చూచిన ప్రకారము క్రీస్తు నామమును ధరించునదియే ఆ సంఘము.

## మరికొన్ని రూపురేఖలు

సంఘమునకు మరికొన్ని రూపురేఖలుకూడా కలవు. సంఘమును సంపాదించుటకు క్రీస్తు తన రక్తమును కార్చెను (అపొ. కా. 20:28). దాని కొరకు ఆయన మృతినొందెను (ఎఫెసీ 5:25). ఇది సంఘము యొక్క విలువను, విశిష్టతను సూచించును. సంఘము ప్రాముఖ్యము కాదని వాదించువారు అనేకులున్నారు. మానవ కల్పిత సంఘముల విషయములో యిది నిజమే కావచ్చును గాని ప్రభువు దాని కొరకు మరణించేటంత మట్టుకు ఇష్టపడినందున అది ప్రాముఖ్యమని విలువగలదని గ్రహింపగుచున్నది. అట్లుగాక మరొక విధముగా ఆలోచించుట క్రీస్తును, ఆయన రక్తమును తిరస్కరించినట్లగును.

సంఘమునకు రక్షకుడు, శిరస్సు క్రీస్తే యని చెప్పబడెను. "క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:25). క్రీస్తు సంఘమునకు యిహసంబంధమైన శిరస్సు లేడు గనుక భూసంబంధమైన ముఖ్యకేంద్రమును లేదు. భూమిపై సార్వజనికముగానైనను, స్థానికముగానైనను ప్రభువు సంఘమునకు శిరస్సుగా గాని ఆయనతో హోదాను పంచుకొన తగిన స్త్రీ పురుషులెవరును లేరు. పైగా అట్టి ఆవశ్యకతయును లేదు. క్రీస్తు ఒక్కడు మాత్రమే శిరస్సైయున్నాడు, అందువలన ప్రతి విషయములోను ఆయనకు విధేయులమై యుండవలెను (ఎఫెసీ 5 : 24). అంతేగాక, క్రీస్తు శరీరమునకు లేక సంఘమునకు రక్షకుడై యున్నాడు. అంటే రక్షింపబడుటకు మనము ఆ సంఘమందు ఉండవలెను. అయితే ఒకడు ఆ సంఘములో ఎట్లు ప్రవేశింపగలడు? నమ్మి బాప్తిస్మము పొందుట

వలన ఒకడు రక్షింపబడును, అప్పుడు ప్రభువు రక్షింపబడిన వానిని ఆ సంఘమునకు చేర్చును (మార్కు 16:16; అపొ. కా. 2:47).

## ప్రభువు ఐక్యత కొరకు ప్రార్థించెను

ప్రభువును వెంబడించు వారందరు ఏకమై యుండవలెనని ఆయన ప్రార్థించెను (యోహాను 17 : 20-23). అపొస్తలుడైన పౌలు కొరింథులో యున్న సంఘమందలి విభజనను ఖండించి, వారందరు విభజింపబడక ఏకభావముతో మాటలాడవలెనని హెచ్చరించెను (1 కొరింథీ 1:10-13). వారిలో భేదములను కలుగజేయుటకు కారకులైన వారిని కనిపెట్టియుండుడని క్రైస్తవులను హెచ్చరించెను; అట్టి వారు ప్రభువైన యేసుక్రీస్తుకు దాసులు కారని రోమా 16:17, 18లో చెప్పెను.

## నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా ?

నా మిత్రుడా, నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా? బైబిలు బోధించు ఒకే ఒక్క సంఘ సభ్యుడవా? కానట్లయితే నీవు కాని సంఘములోయున్నావు. ప్రభువు కట్టనటువంటి, దానికొరకు ఆయన మృతి నొందనట్టి, రక్షకుడుగా లేనటువంటి, దానికొరకు ఆయన తిరిగి రానటువంటి అసత్య సంఘములో నీవు యున్నావు. సంఘమును గూర్చిన సత్యమును నేర్చుకొనుటకు బైబిలునొద్దకు తిరిగి రావలసినదిగా నిన్ను కోరుచున్నాను. అప్పుడు సత్యమును గ్రహింతువు, దానిని అంగీకరించునట్లును, ప్రభువు నిన్ను రక్షించి ఆయన సంఘమునకు చేర్చునట్లును, నీవు క్రైస్తవుడవుమాత్రమే కాగల్గుటకును ప్రార్థింతును.

మీ ప్రాంతమందున్న క్రీస్తుసంఘమును దర్శించుము లేదా మమ్మును సంప్రతించుము. నీవు క్రైస్తవుడవగుటకు తగు యేర్పాటు జేతుము.

# 1900 సంవత్సరముల పాత సంఘము !

*(The Church 1900 years old !)*

## వయస్సు ప్రాముఖ్యమా?

అన్నిటికంటె పురాతన సంఘము ఏది? సంఘవయస్సు అత్యంత ప్రాముఖ్యమైనది. లేఖనములలో చెప్పిన దినమున ఆరంభమైన సంఘము గాక మరేదియు కూడ దైవికమైనది కాదు. ఈ లోకములో యున్న 400 డినామినేషనులన్నిటికంటె ముందుగా, 1900 సంవత్సరములకు పూర్వమే స్థాపింపబడిన ఒక సంఘము ఉన్నదని తెలిసికొనుట చాల సంతోషకరమైన సంగతి! అవును, ఈనాడు అందరును దానిలో సభ్యులుగా యుండు తరుణమును కలిగియున్నారు.

క్రైస్తవ లోకములో కనబడుచున్న విభజనలు, జగడములను గూర్చి నేటి లోకము విసుగుజెంది యున్నది. విశ్వాస ప్రమాణిక కర్తలనుండి, పోపులనుండి, మానవ డినామినేషన్లనుండి ఆదిమ సంఘము నొద్దకు పయనించు ఆశ్చర్యకరమైన ఉద్యమము ఈనాడున్నది. మొదటి శతాబ్దములో దేవుని వాక్యము ఏమిచేసెనో దానినే ఈనాడును చేయగలదు! మనకు అదే ప్రభువు ఉన్నాడు, అదే పరలోక నిరీక్షణ, అదే బైబిలు ఉన్నది. మరియు ఆదిలో వారివలెనే మనమును అదే సంఘ సభ్యులము కాగలము. దేవుని కుమారునిచే నిర్మింపబడిన ఆదిమ సంఘములో సభ్యులమై యుండగలమని తెలిసికొనుట ఆనందదాయకము.

## సంఘజన్మదినము

యేసు పరలోకమునకు ఆరోహణుడైన తరువాత క్రీ॥ శ॥ 33వ సంవత్సరమున పెంతెకొస్తు సంఘ జన్మదినము (అపో.కా.2). క్రీస్తు దాని నిర్మాణికుడు (మత్తయి 16:18). ఆదిలో అది యెట్లుండెను? ఆరాధనలో ప్రతి ఆదివారము పాటలు పాడుట, ప్రార్థన చేయుట,

వాక్యోపదేశము జరిగించుట, ప్రభురాత్రిభోజనములో పాలుపొందుట కానుకలిచ్చుట జరిగేది (అపొ. కా. 20:7; 2:42). బోధలో అయితే దేవుని వాక్యము తప్ప మానవ ప్రమాణములేవి బోధింపబడేవి కావు. పాలనపద్ధతిలో ప్రతి స్థానిక సంఘములో పెద్దలు, పరిచారకులు, పరిశుద్ధులు ఉండేవారు. ఐక్యతలో సంఘము ఒక్కటేయుండెను. రక్షింపబడిన వారందరిని ప్రభువు చేర్చే ఒకే ఒక్క దైవిక సంస్థ యుండేది, అదే సంఘము (అపొ. కా. 2:47).

అదంతా ఈనాడు శోచనీయముగా వేరుగా యున్నది. ఇప్పుడు చీలికల సమూహములు ఒక రోగమువలె పెరుగుచు సువార్తకు అభ్యంతరము కలుగజేయుచున్నవి. అయితే మిత్రులారా, అందరు ఒకే క్రొత్త నిబంధన సంఘమునకు చెందవలెనని, ఒకే సంగతులను విశ్వసించవలెనని, విభజనలు ఏమియు ఉండకూడదని దేవుని చిత్తమై యున్నది (1 కొరింథి 1:10). ప్రతి సంఘములోను ఒకే సంగతులను బోధించినట్లు పౌలు చెప్పెను (1 కొరింథీ 4:17). ఏలయనగా అప్పుడు ఒకే విశ్వాసము, ఒకే బోధ, ఒకే సంఘము ఉండెను.

## ఐక్యతకు మార్గము

అయితే అదెట్లు సాధించగలము? బైబిలుకు సరియైన ఘనత నిచ్చుటద్వారా సాధించగలము. బైబిలు పరిపూర్ణమైనది, సంపూర్ణమైనది. అది చెప్పుదానిని మనము తప్పక చేయవలెను. మత సంబంధ విషయాల్లో ప్రభువు చెప్పు మాటలచొప్పున ప్రతివారు జరిగించిన యెడల విభజనల శాపము లోకములో యుండకపోవును. అయితే దేవుని వాక్యములో ఆజ్ఞాపింపబడని సంగతులను కొన్నిటిని ఆరాధనలోను, సంఘ పాలన పద్ధతిలోను, నామములలోను, ఆచారములలోను ఇప్పుడు కనుగొనుచున్నాము. లేఖనముల నధిగమించి వెళ్ళుట యనగా దేవుని కోల్పోవుట యని యోహాను చెప్పుచున్నాడు (2 యోహాను :9). ఫలాని సంగతిని బైబిలు ఎక్కడ నిషేధించుచున్నది యను

నది ప్రశ్న కాదు గాని దానిని బైబిలు ఎక్కడ ఆజ్ఞాపించుచున్నది యనునది. నిజముగా బైబిలును సరిగా గౌరవించి, అది అధికారమిచ్చు దానినే జరిగించినయెడల క్రొత్తనిబంధన సంఘము పునరుద్ధరించబడ గలదు. బైబిలు మాత్రమే కేవలము క్రైస్తవులను తయారుచేయును!

ఆదిలో క్రైస్తవ్యము ఆచరింపబడినట్లు మనము ఈనాడు ఆచరించినయెడల మనము ఏ డినామినేషన్‌కు చెందక క్రొత్తనిబంధన సంఘ సభ్యులై క్రైస్తవులుగా మాత్రమే యుందుము. పౌలు, పేతురు, ఆదిమ క్రైస్తవులు ఏ సంఘమునకు చెందియుండిరి? వారు ఏ డినామినేషన్‌కు సభ్యులు గాక మన ప్రభువుయొక్క సంఘ సభ్యులైరి. క్రొత్తనిబంధన సంఘమునకు శతాబ్దముల తరువాత రోమన్ కేథలిక్కులు ప్రొటెస్టాంటు డినామినేషన్లు పుద్భవించెను.

## క్రీస్తు చిత్తము

ఆదిమ సంఘమునొద్దకు మరలవలసినదని క్రీస్తు సంఘములు విజ్ఞాపన చేయుచున్నవి. క్రీస్తు సంఘములు ఒక మతశాఖ గాని, గుంపు గాని కాదు. పరలోకమందును భూమిమీదను వారికి ఉన్న ఒకే శిరస్సు మన యేసుక్రీస్తు ప్రభువు. వారి ఆరాధన మానవ కల్పితములతో మిళితముగాక దేవుడు బయలుపరచిన ఆరాధనయై యున్నది. వారి విశ్వాసప్రమాణికము బైబిలు మాత్రమే. బైబిలు తప్ప వేరొకటి ఏమియు లేదు.

మానవ నామములతో ముద్రింపబడక, మానవ ప్రమాణిక ములతో బంధింపబడక క్రైస్తవునిగా మాత్రమే యుండు మార్గమిది. క్రీస్తునందు మానవులందరు ఏకమైయుండు ఐకమత్య బాట యిది.

క్రీస్తు సంఘమును మీరు దర్శించి, పరిశోధించి, దానినిగూర్చి ప్రశ్నలడిగి తెలిసికొనుడని అది మీకు హృదయపూర్వక ఆహ్వానము నందించుచున్నది.

— మేక్ లేటన్

# దైవిక సవాలు

## *(The Divine Challenge)*

"మీరు మారు మనస్సు పొందని యెడల మీరందరును అలాగే నశింతురు" లూకా 1౩:3

I దేవుని రక్షణా సంకల్పము

A. దేవుని పాత్ర :

1. దేవుడు మానవుని యెంతో ప్రేమించెను (యోహాను 3:16)
2. ఆయన క్రీస్తును రక్షకునిగా అనుగ్రహించెను (లూకా 19:10)
3. పరిశుద్ధాత్ముని మార్గదర్శిగా పంపెను (యోహాను 16:13)
4. రక్షణ కలుగజేయుటకు సువార్తను శక్తిగా యిచ్చెను (రోమా 1:16)
5. క్రీస్తు రక్తము వలన విమోచన నొసగెను (రోమా 5 : 9; కొలస్స 1:14)

B. మానవుని పాత్ర :

1. సువార్త వినుము (రోమా 10:17; యోహాను 8:32)
2. సువార్తను విశ్వసింపుము (హెబ్రీ 11:6; యోహాను 20:31)
3. గత పాపముల విషయమై మారుమనస్సు పొందుము (లూకా 13:3; అపో 17:30)
4. క్రీస్తు యందలి విశ్వాసమును నోటితో ఒప్పుకొనుము (రోమా 10:10; మత్తయి 10:32)
5. బాప్తిస్మము పొందుము (గలతీ 3 : 27; మార్కు 16 : 16; అపో 2:38)

దేవుడు తన బాధ్యతను నిర్వర్తించెను; నీవు నీ బాధ్యత నిప్పుడు నిర్వర్తింతువా?

II ఒకడు యెందుకు బాప్తిస్మము పొందవలెను?

1. బాప్తిస్మము పొందమని క్రీస్తు ఆజ్ఞాపించెను (మత్తయి28:18-20)
2. "నమ్మి బాప్తిస్మము పొందినవారు రక్షింపబడుదురు" (మార్కు 16:16)
3. "పాపవిముక్తి నొందుటకు" బాప్తిస్మము పొందవలెను (అపొ2:38)
4. బాప్తిస్మ మొకనిని "క్రీస్తులో" ఉంచును (రోమా 6 : 3; కొలస్స 2:12)
5. బాప్తిస్మ మొకనిని క్రీస్తు శరీరములో ఉంచును (1కొరింథీ12:13)
6. బాప్తిస్మముద్వారా మనము "క్రీస్తును ధరించుకొందుము" (గలతీ 3 : 27).
7. బాప్తిస్మముద్వారా క్రీస్తు మరణములో పాలు పొందుదుము (రోమా 6 : 4).
8. బాప్తిస్మములో మన "పాపములు కడిగివేయ బడును" (అపొ. 22 : 16).
9. మన విశ్వాసమునకు అది రుజువై యుండును (గలతీ 3:26, 27).
10. బాప్తిస్మము "యిప్పుడు మనలను రక్షించు చున్నది" (1 పేతురు 3:21).

## క్రీస్తు సువార్తకు విధేయత జూపుము!

III క్రొత్త నిబంధన యేమి బోధించుచున్నది ?

1. కృప వలన పాపి రక్షింపబడి యున్నాడు (ఎఫెసీ 2:8).
2. కృప వలన మాత్రమే పాపి రక్షింపబడలేదు (ఎఫెసీ 2:8; లూకా 13:3; మార్కు 16:16).
3. విశ్వాసముద్వారా పాపి రక్షింపబడును (అపొ. 16:31).
4. విశ్వాసము వలన మాత్రమే పాపి రక్షింపబడలేదు (యాకోబు 2:17, 20, 24, 26; అపొ. 2:38).
5. మారుమనస్సు వలన పాపి రక్షింపబడును (లూకా 13:3; అపొ. 17:30).

6. క్రీస్తు నందలి తన విశ్వాసమును పాపి ఒప్పుకొన వలెను (మత్తయి 10:32; రోమా 10:10).
7. రక్షణ పొందుటకు బాప్తిస్మము అవసరము (1 పేతురు 3:21; గలతీ 3:27; మార్కు 16:16).
8. క్రొత్త నిబంధన బాప్తిస్మము నీటిలో ముంచుటయే (రోమా 6:4; అపో. 8:38, 39; మత్తయి 3:6, 16).
9. పసిపిల్లలు బాప్తిస్మము పొంద నర్హులుకారు. వారు విశ్వసింప లేరు, మారుమనస్సు పొందలేరు, వారికి పాపమేలేదు (మత్తయి 28:20; మార్కు 16:16; అపో. 2:38).
10. విశ్వాసము ఒక్కటే (ఎఫెసీ 4:5).
11. క్రీస్తును గూర్చిన మాట వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17).
12. శరీరము ఒక్కటే (ఎఫెసీ 4:4).
13. ఒకే ఒక్క శరీరము ఉన్నది (1 కొరింథీ 12:20).
14. ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:18).
15. గనుక ఒక్క సంఘమే ఉన్నది.
16. క్రీస్తు తన సంఘమును యెరూషలేమునందు స్థాపించెను (అపో. 2; లూకా 24:47).
17. తొట్రిల్లిన క్రైస్తవుడు క్షమాపణ నొందవలెనంటే మారు మనస్సు పొంది ప్రార్థన చేయవలెను (అపో. 8 : 22; 1 యోహాను 2:1, 2).
18. దేవుని బిడ్డయైనవాడు నమ్మకముగా జీవించని యెడల నరకమును తప్పించుకొనలేడు (1కొరింథీ 10 : 12; గలతీ 5:4; 2 పేతురు 2:20; ప్రకటన 3:16).
19. క్రైస్తవులు ప్రభువు దినమున కూడుకొనవలెను (అపో. 20:7; హెబ్రీ 10:25).

20. మరణమువరకు క్రైస్తవులు నమ్మకముగా యుండ వలెను (ప్రకటన 2:10).

## క్రీస్తు సంఘమును గూర్చి పరిశోధింపుము !

IV ఎందుకు క్రీస్తు సంఘ సభ్యుడవై యుండవలెను ?

1. క్రీస్తు సంఘము యేసుక్రీస్తుచే కట్టబడెను (మత్తయి 16:18).
2. అది లేఖనానుసారమైన పునాదిపై కట్టబడెను (మత్తయి 16:18).
3. అది లేఖనప్రకారమగు స్థలమైన యెరూషలేములో ప్రారంభ మాయెను (లూకా 24:47).
4. అది లేఖనానుసారమైన కాలమందు, క్రీస్తు పునరుత్థానమొంది న తరువాత వచ్చిన మొదటి పెంతెకొస్తునాడు, స్థాపింపబడెను (అపొ. 2).
5. ఆ సంఘస్థాపకుడు క్రీస్తే (ఎఫెసీ 1:22, 23).
6. అది వాక్యప్రకారమైన నామములు ధరించును (రోమా16:16; అపొ. 20:28)
7. అది వాక్యానుసారమైన పరిపాలనను కలిగియున్నది (1 తిమోతి 3; తీతు 1)
8. బైబిలు ఒక్కటే దాని ప్రమాణిక గ్రంథము
9. బైబిలు అంతయు దైవావేశము వలన కలిగిన దేవుని వాక్య మని అది నమ్మును (2 తిమోతి 3:16,17)
10. క్రీస్తు రక్తము ద్వారా మానవుడు రక్షింపబడుచున్నాడని అది బోధించును (రోమా 6:4)
11. క్రొత్త నిబంధన బోధించుచున్నట్లుగా అది నీటిలో సమాధి చేయుట ద్వారా బాప్తిస్మము యిచ్చును (రోమా 6:3,4)
12. అది ఆరాధనయందు దైవ పద్ధతిని అనుసరించును (యోహాను 4:24)

13. రక్షింపబడుటకు క్రీస్తు సంఘమందు ఉండవలెను :

ఎ. అది క్రీస్తు రక్తమువలన కొనబడిన సంఘము (అపొ 20:23)

బి. సంఘమను శరీరమును క్రీస్తే రక్షించును (ఎఫెసీ 5:23)

సి. రక్షింపబడిన వారందరు సంఘముతో చేర్చబడిరి (అపొ 2:47)

డి. సంఘమే దేవుని కుటుంబము (1 తిమోతి 3:15)

ఇ. గుడారము ఛాయా రూపకమైనది. అందలి పరిశుద్ధ స్థలము సంఘమునకు, అతి పరిశుద్ధ స్థలము పరలోకమునకు సాదృశ్యముగా యున్నవి. పరిశుద్ధ స్థలములో నుండి వెళ్ళకుండ అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశింపలేనట్లే, ఒకడు సంఘములో చేరకుండా పరలోకములో ప్రవేశింపలేడు(హెబ్రీ 8).

నీవు ప్రభువుయొక్క సంఘ సభ్యుడవా?

V మార్పునొందిన వారి దృష్టాంతములు :

| | |
|---|---|
| 1. యూదులు - పెంతెకొస్తునాడు | (అపొ. కా. 2) |
| 2. సమరయులు | (అపొ. కా. 8) |
| 3. నపుంసకుడు | (అపొ. కా. 8) |
| 4. తార్సువాడైన సౌలు | (అపొ. కా. 9, 22) |
| 5. అన్యులు - కొర్నేలీ | (అపొ. కా. 10, 11) |
| 6. లూదియ | (అపొ. కా. 16) |
| 7. చెరసాల అధికారి | (అపొ. కా. 16) |
| 8. కొరింథీయులు | (అపొ. కా. 16) |

పై సంఘటనలు జాగ్రత్తగా పఠించి, వారివలె దేవునికి లోబడుము. మీ ప్రాంతములో యున్న క్రీస్తు సంఘ ఆరాధనలకు హాజరుకమ్ము.

W. A. బ్రాడ్‌ఫీల్డ్.

# సంఘము

## (The Church)

క్రొత్త నిబంధనలో మొట్టమొదటిసారిగా సంఘము అనుపదము మత్తయి సువార్తలో మనము చూడగలము. మత్తయి 16 : 18 లో "నా సంఘమును కట్టుదునని" క్రీస్తు చెప్పియున్నాడు. బైబిలునందు చెప్పబడిన సంఘమిదియే.

## సంఘమును గూర్చిన కొన్ని అపోహలు

అబ్రహాము దినములలోనే ఆ సంఘము స్థాపింపబడినదని కొందరు చెప్పుదురు. క్రీస్తు మత్తయి 16:18లో చెప్పిన వాక్యమును బట్టి అది ఎంతమాత్రమును సత్యము కాదని తెలిసికొనవచ్చును. కొందరు బాప్తిస్మమిచ్చు యోహాను దినములలోనే అది స్థాపింపబడినదని చెప్పుదురు. కాని క్రీస్తు "నా సంఘమును కట్టుదును" అని చెప్పకముందే యోహాను చనిపోయి యుండుటవలన అదియును సత్యము కాదు.

కొందరు పేతురుమీద ఆ సంఘము కట్టబడినదని చెప్పుదురు. "వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది యేసుక్రీస్తే" (1 కొరింథి 3:11) అని బైబిలు చెప్పుచున్నందున పైవారు చెప్పు సంగతి సత్యమునకెంతయూ దూరముగ నున్నది. పేతురు అను బండమీద ఆ సంఘము నిర్మింపబడినదని కొందరు బోధించుదురు. కాని 1 కొరింథి 10:4 ద్వారా ఆ బండ క్రీస్తేఅని మనము గ్రహించ గలము.

ప్రస్తుత రోజులలోనున్న క్రైస్తవమతశాఖలన్నిటి (DENOMINATIONS) తోను ఆ సంఘము తయారైనదని కొందరు చెప్పుదురు. కాని మతశాఖ లుద్భవించుటకు పూర్వము కొన్నివందల సంవత్సరముల క్రితమే ఆ సంఘముండినందున అదియును సత్యముకాదు.

సంఘమునకు క్రీస్తు శిరస్సు అయియున్నాడు. "మరియు సమస్తమును ఆయనపాదముల క్రిందవుంచి సమస్తము పైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22, 23).

ప్రతి మతశాఖయు దాని స్వంత ప్రధానాధికారిని కలిగి ఉన్నది. దాని స్వంత శరీరము కలిగియున్నది. అది క్రీస్తు శరీరమందలి భాగములు కాక దానికి వ్యతిరేక భాగములై యుండి ఆయన ఎన్నడును అంగీకరించని సేవను ఆయనకు చేయుచున్నది.

కొందరు ఒక సంఘము నందుండకనే దేవునికి సేవ చేయవచ్చునని కూడా బోధించుదురు. కాని దేవుని వాక్యమీలాగున చెప్పుచున్నది: "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తర తరములు సదాకాలము మహిమ కలుగును గాక. ఆమెన్" (ఎఫెసీ 3 : 21). మనము సంఘమునందుండి క్రీస్తు యేసు మూలముగా ఆయనకు సేవచేయవలెనని ఆయన నియమించి యున్నాడు. కనుక నీవు దేవుని వాక్యము నంగీకరించెదవా? లేక మానవుని మాటలను విందువా?

సంఘమనునది వుండనవసరము లేని యెడల క్రీస్తు చనిపోవలసిన కారణమేమి? పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు ఆయన తన రక్తము చిందించి యున్నాడు (మత్తయి 26 : 28). అనేకులెవరు? "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగ నుంచెనో ఆ యావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా యుండుడి" (అ. కా. 20:28).

"మిమ్మును రక్షించునది సంఘముకాదు" అని తరచు కొందరు చెప్పుచుందురు. అది సత్యమే! క్రీస్తు యేసునందు తప్ప మరి యితరమైన

దానియందు రక్షణ లేదు (అపో. కా. 4 : 12). అయినను రక్షింప బడినవారు ఆ సంఘమందున్నారని బైబిలు బోధించుచున్నది. మీరు వివిధ మతశాఖలలో మిమ్మునుగా చేరెదరు, గాని ఆయన తన సంఘమునందు తనకుగా మిమ్మును చేర్చుకొనును.

## సంఘమును గూర్చి క్రొ. ని. బోధ

రక్షింపబడిన వారిని ఆయన తన సంఘములో చేర్చును. ఎవరు రక్షింప బడుదురు ? "ప్రకటింపబడు సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" యేసుక్రీస్తు చెప్పియున్నాడు (మార్కు 16:16). ఆయన మరణ పునరుత్థాన వాస్తవమువలే మొట్టమొదటిగా అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయమందు ప్రపంచమున కీయ బడినవి. "కాబట్టి (అతని) వాక్యము నంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు యించుమించు మూడు వేలమంది చేర్చబడిరి" అని అపొ. కా. 2:41 లో వ్రాయబడి యుండుట మనము చూడ గలము.

క్రొత్త నిబంధన సంఘపు గుణ విశేషములను మన మిపుడు చూతము :—

1. దేవుని మందిరము యెరూషలేమునందు స్థాపింప బడవలసి యుండెను (యెషయా 2:2-3).

2. ఆ సంఘమునకు శిరస్సు క్రీస్తే. ఆయన దాని పరిపాలనాధి కారమును ఎవరికిని, ఎన్నడును ఈయ లేదు (ఎఫెసీ 1:22, 23).

3. బాప్తిస్మము పొందిన విశ్వాసులతో ఆ సంఘము కూడి యున్నది (అపొ. కా. 2:41).

4. దానిని ఆయన నీటిద్వారా కడుగుటవలన పరిశుద్ధపరచి ప్రతిష్ఠించి యున్నాడు. చరిత్ర ప్రకారము క్రొత్త నిబంధనలో చిలక రింపుగాని, కుమ్మరింపుగాని పొందిన వారెవరును లేరు. హెబ్రీయులకు

వ్రాయబడిన పత్రికద్వారా మనకొక గొప్ప యాజకుడు (యేసుక్రీస్తు) దేవుని మందిరము (సంఘము) నందున్నాడని తెలిసికొనగలము (1 తిమోతి 3:15). మనము క్రీస్తు రక్తమువలన ప్రోత్సహింపబడుటచే యథార్థ హృదయము, సంపూర్ణ విశ్వాసము కలిగి నిర్మలమైన ఉదకములో కడుగబడిన వారమై దేవుని సన్నిధానమునకు చేరుదుము. (హెబ్రీ 10:19-22).

5. ఆ సంఘము ప్రవక్తలయొక్కయు, అపొస్తలుల యొక్కయు పునాదుల మీద క్రీస్తు యేసు మూలరాయి అయి యుండగ నిర్మింపబడెను (ఎఫెసీ 2:20).

6. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయ నేరడు. ఈ పునాది క్రీస్తు" (1 కొరింథి 3:11). క్రొత్త నిబంధన సంఘము ఒక సూక్ష్మమైన దేవుని సంస్థ. దీనియందిహలోక అధికారులు లేరు. అది ఒక మతశాఖకాదు. ప్రతి వ్యక్తిగత సంఘము క్రీస్తునందు స్వేచ్ఛను కలిగియున్నది. ఆయన పునరుత్థానమునకు అపొస్తలులే సాక్షులు.

స్థానిక సంఘముల యందు పెద్దలు, పరిచారకులు ఉందురు. క్రొత్త నిబంధన సంఘము దీనిని తప్ప మరియే యితర ప్రభుత్వమును ఎరుగదు. ప్రభువు మార్గము యథార్థమని నమ్ముచున్నాను. నీవు కూడా నమ్ముచున్నావా?

— జె. సి. బెయిలీ

---

## రక్షింపబడుటకు ఒకడు క్రీస్తు సంఘములో యుండవలెనా?

*( Must one be in the Church to be Saved ? )*

ఇది అతి ముఖ్యమైన ప్రశ్నయై యున్నది. ఇందును గూర్చి

సరియగు జవాబును దైవగ్రంథమైన బైబిలు మాత్రమే ఇయ్యగలదు. అబద్ధ మాడనివాడు దేవుడు మాత్రమే యని రోమా 3:4 లో వ్రాయబడినది, గాన దైవ గ్రంథమును పరిశోధించుట యుక్తము.

## నయమాను ఒక ఉదాహరణ

2 రాజులు 5 : 12 లో కుష్ఠురోగియైన నయమాను ఇట్లను చున్నాడు : దమస్కు నదులైన అబానాయును ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదు లన్నిటికంటె శ్రేష్ఠమైనవి కావా ? వాటిలో స్నానముచేసి శుద్ధి నొందలేనా ? అనుకొని రౌద్రుడై మరలిపోవు చుండగా అతని దాసులలో ఒకడు వచ్చి — "ఆ ప్రవక్త యేదైన నొక గొప్ప కార్యము చేయుమని నియమించిన యెడల నీవు చేయ కుందువా ? అయితే స్నానముచేసి శుద్ధుడవు కమ్మనుమాట చెప్పి కంటె మేలుకాదా" అని చెప్పినప్పుడు అతడు పోయి దైవజనుడు దాని నట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునగగా అతని దేహము పసి పిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెనని 2 రాజులు 5:13-14 లో చదువుచున్నాము. నయమాను ప్రవక్త చెప్పినట్లు యొర్దాను నదిలో 7 సార్లు మునుగుటకు నిరాకరించి, తాను తలంచినట్లు యింకా శ్రేష్ఠ మైన యితర నదులలో ఎన్నిసార్లు స్నానముచేసి వుండినను, అతని కుష్ఠురోగముపోయి శుద్ధుడగునా ?

## నోవహు మరియొక ఉదాహరణ

ఆదికాండము 6, 7 అధ్యాయములలో తాను సృజించిన అప్పటి లోకము పాపముతో నిండి యుండగా దేవుడైన యెహోవా సంతా పము నొంది తన హృదయములో నొచ్చుకొని లోకమంతటిని జల ప్రళయములో ముంచి సర్వమును నాశనము చేయబూని, ఆ తర ములో నీతిమంతుడుగా ఉండిన నోవహుతో చితిసారకపు మ్రానుతో ఒక ఓడను చేసికొమ్మని ఆజ్ఞాపింపగా నోవహు యావత్తు దేవుడు

చెప్పినట్లు చేసి ఆ భయంకరమైన జలప్రళయము నుండి తాను తన కుటుంబమును రక్షించుకొనినట్లు చదువుచున్నాము. నీతిమంతుడైన నోవహు రాబోవు ఉగ్రత నుండి తప్పించుకొనుటకు ఓడలోకి రమ్మని ప్రకటించగా ప్రజలు నమ్మక హేళనచేసి వారందరు నాశనమైరి. నీళ్లు రాగా వారిలో అనేకులు, మిద్దెలు, మేడలు, కొండలు, పర్వతములు ఎక్కి ప్రాణములు దక్కించుకొన ప్రయత్నించి వుండవచ్చును గాని మానవుల ప్రయత్నములు నిలిచెనా ? దేవుని ఆజ్ఞ ప్రకారము ఓడలో వున్న ఆ ఒకే ఒక్క కుటుంబము మాత్రమే రక్షింపబడెను. అందరు జలప్రళయములో మునిగి నాశనమైరి.

ఆలాగే ఈ కడవరి దినములలో దయగల దేవుడు సర్వలోకమును తన ఉగ్రత నుండి తప్పింపనెంచి తన ప్రియ కుమారుని యీ లోకమునకు పంపి లోక పాపభారము నంతయు తన కుమారుడైన క్రీస్తుపై మోపి ఆయన రక్తముద్వారా పాపములకు విడుగుడు దయపాలించి ఆయనద్వారా మానవ రక్షణార్థము ఒక సంఘమును నిర్మింప జేసెను.

అపొ. కా. 2వ అధ్యాయములో సంఘము ఉద్భవించెను. క్రీస్తు మత్త 16 : 18 లో సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను. 3000మందితో సంఘము ప్రారంభమాయెను. యేసు తనకు విధేయులైన వారిని తానే తన సంఘములో చేర్చుచున్నాడు (అపొ. కా. 2:47). ఆయనే తన స్వరక్త మిచ్చి దానిని సంపాదించెను (అపొ. కా. 20:28). ఆయనే దాని శిరస్సు (ఎఫెసీ 5:23-24). ఆయనే దాని సంరక్షకుడు.

ఆ ఏకైక సంఘములో క్రీస్తుద్వారా ప్రవేశించి ఆనందించుమని ఆయన పేరట ప్రేమపూర్వకముగా మిమ్ము వేడుకొనుచున్నాము.

—బి. లాజరస్

## పేతురు పోపా ?

## *(Was Peter a Pope?)*

మిగిలిన అపొస్తలులకంటె పేతురు అనేకసార్లు వ్యక్తిగత

ప్రాముఖ్యత కలిగియుండుట నిజమే. అపొస్తలుల జాబితాలన్నిటిలో అతని పేరు ముందు కనబడును (మత్తయి 10:2-4). అయితే ఈనాడు తరచుగా అడుగబడుచున్న ప్రశ్న పేతురు ప్రముఖుడా? యనునది కాదుగాని, పేతురు సంఘ శిరస్సుగా యుండెనా? మరియు రోమా పట్టణపు బిషప్పులు పేతురు తరువాత వచ్చినారా యనునది. పేతురు మొదటి పోప్ (**Pope**) అనియు, మన ప్రభువుయొక్క సంఘము అతనిపై నిర్మింపబడెననియు, అతనికిని అతని తరువాత వచ్చిన వారికిని సమస్తాధికారము ఈయబడెనినియు కొందరు భావింతురు. అయితే మన ప్రభువు పేతురుకు మత సంబంధమైన ప్రాముఖ్యతను ఏమియు ఇయ్య లేదని ఈ క్రింది లేఖనముల వలన తెలిసికొన వచ్చును.

1) సంఘపు పునాది పేతురు అని మత్తయి 16:18 బోధించుట లేదు. క్రీస్తు తన సంఘమును బండలో ఒక చిన్నముక్క అయిన రాతిపైగాక అనిశ్చలమైన పర్వత బండపై అనగా పేతురు ఒప్పుకొనిన సత్యముపై నిర్మించెను.

2) మిగిలిన అపొస్తలులు నేరుగా క్రీస్తునుండియే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి. మరియు బంధించుటకును, విప్పుటకును సమానముగా ఆత్మ ప్రేరితులైరి (మత్తయి 18:18; యోహాను 20: 21-23; అపొ. కా. 1:8; 2:1-4). గనుక పేతురుకు కలిగిన ప్రాము ఖ్యత అంతా సువార్త ద్వారములను ఈ లోకమునకు మొదట తెరచు టలోనే యుండెను.

3) క్రీస్తు పేతురును సంఘ శిరస్సుగా నియమించుటకు గాని లేక వారందరిపై అధికారిగా నియమించుటకుగాని యోచించు చున్నట్లు అపొస్తలులెవరు భావించి యుండలేదు. ఫిలిప్పుదైన కైసర యలో సంభాషణ జరిగిన కొన్నిదినముల తరువాత సలోమియు ఆమె యిద్దరు కుమారులును ఆయన రాజ్యములో ప్రముఖ స్థానములను గూర్చి క్రీస్తునడిగిరి (మత్తయి 20:20-23; మార్కు 10 : 35-45). అంతేకాదు వారి ఆఖరి రాత్రి భోజనము దగ్గర ఆ పండ్రెండుగురిలో

గొప్పవాడెవరో యను దానిపై వివాదమేర్పడెను (లూకా 22:24-30). అయితే ఈ గొప్ప స్థానమును అప్పటికే ప్రభువు పేతురుకు ఇచ్చి యుండినయెడల వారెవరును దాని సంగతి ఎరుగకుండుట వింతయే. అయితే మీరందరు సహోదరులనియు, వినయముతో పరిచర్య చేయుటలో నిజమైన ఘనత లభించుననియు, వారిలో ఎవడును మిగిలిన వారిపై అధికారము చేయరాదనియు క్రీస్తు తన శిష్యులకు చెప్పెను (మత్తయి 18:1-4).

4) అపొస్తలులలో ఒకనినని, యేసుయొక్క దాసుడనని, తోటి పెద్దనని పేతురు తననుగూర్చి తెలియజేసెను (1 పేతురు 1:1;2 పేతురు 1:1; 1 పేతురు 5:1). గాని భూమిపై సంఘమునకు తాను శిరస్సునని అతడెన్నడు చెప్పుకొనలేదు. మిగతా అపొస్తలులపై ఎట్టి అధికారమును చెలాయించలేదు. క్రైస్తవులు సజీవమైన రాళ్ళవలెనుండి పోపుగాయున్న అతనిపై గాక క్రీస్తుపై నిర్మించబడిన వారనికూడ అతడు తెలియజేసెను (1 పేతురు 2:3-8).

5) పేతురు ఒక వివాహితుడు; అతనికొక భార్య, అత్తకూడ కలరు (మత్తయి 8:14). సంఘము స్థాపించబడిన అనేక సంవత్సరముల తరువాతకూడ అతడు తనభార్యను కలిగియుండెను (1 కొరింథీ 9 : 5). పేతురు తరువాత వచ్చిన వారమని చెప్పుకొనువారి ఆచారమునకు ఇది విరుద్ధముగాయున్నది. అయితే పేతురు గనుక మొదటి పోపుగాని లేక బిషప్పుగాని అయ్యుంటే అతడు వివాహితుడై యుండెను; ఏల యనగా అధ్యక్షుడగువాడు ఏక పత్నీ పురుషుడై యుండవలెనని బైబిలు చెప్పుచున్నది (1 తిమో 3 : 2-5; తీతు 1 : 6). ఏవిధముగానైనను ఈనాటి పోపుల ఆరోపణలను ఇది ఖండించుచున్నది.

6) మానవారాధనలో ఆనంద భరితులగుచున్న పోపుల స్వభావమునకు విరుద్ధముగా పేతురు మరొక మానవునినుండి ఆరాధన స్వీకరించలేదు. సరిగదా అతని వ్యక్తిగతజీవితములో అతడు దోషము లేనివాడు కాదు. అతడొకసారి అపరాధిగా తీర్చబడెను గనుక పౌలు

అతనిని ముఖాముఖిగా ఎదిరించెను. అతడెన్నడు పొరపాటు పడనివాడైతే (infallible) ఈ సంగతి జరుగక పోవును (అపొ. కా. 10:25, 26; గలతీ 2:11).

7) మిక్కిలి శ్రేష్ఠులైన అపొస్తలులకంటె నేను ఏవిషయములోను తక్కువవాడను కాను అని పౌలు చెప్పెను. గనుక . పౌలుకూడ సంఘ శిరస్సుగా యుండెనా? (2 కొరింథీ 11 : 5; 12 : 11). అట్లు కానేకాదు. సరిగదా ముఖ్యముగా అన్యజనులతో ఏర్పడిన సంఘమునకు ఎవడైనను శిరస్సుగా యుండతగినయెడల అతడు పౌలు. ఏలయనగా అన్యజనాంగములకు అపొస్తలుడుగా యుండుటకు ప్రభువతనిని ఏర్పరచుకొనెను.

వాస్తవముగా పేతురుయొక్క మత సంబంధ ప్రాముఖ్యతను గూర్చి క్రీస్తు ఎన్నడు పలుకలేదు. పేతురు ఆరోపించుకొనలేదు మిగిలిన అపొస్తలులు దానిని అంగీకరించలేదు. ఏరీతిగనైనను పేతురు సంఘ శిరస్సు కాదు. సంఘము స్థాపించబడిన తరువాతను పరిశుద్ధాత్ముడు అపొస్తలులను సర్వ సత్యములోనికి నడిపించిన తరువాతను అపొస్తలులెవరు పేతురు తమ అధికారియనిగాని లేక సంఘ శిరస్సనిగాని పలుకలేదు. సరిగదా సంఘమను శరీరమునకు క్రీస్తే శిరస్సు అనియు, ఆయనకు అన్నిటిలోను ప్రాముఖ్యము కలుగువలెననియు వారు బోధించిరి (కొలస్స 1:18).

మత్తయి 16:18 ప్రకారము పేతురు కేదో ప్రముఖ స్థానము ఈయబడినదని మనము అంగీకరించా మనుకొందాము. అయినను కూడ పేతురు రోమాలో బిషప్పుగా యున్న ఋజువు లేమియు లేవు. ఒకవేళ అతడు బిషప్పుగా యున్నను అతని ప్రముఖతను మరొకనికిచ్చిన ఋజువేమియులేదు. అపొస్తలులను నేరుగా ప్రభువే నియమించెను. వారి తరువాత వారి స్థానము నలంకరించిన వారెవరును లేరు. పేతురు తరువాత పొరపాటు చేయనివారు అతని స్థానము నలంక

రించవలెనని, అట్టివారు క్రీస్తు ప్రతినిధులని సంఘశిరస్సు అని బైబిలు ఎక్కడ బోధించుటలేదు. పేతురు ఎన్నడయినా రోమా పట్టణములో యున్నట్టి వాస్తవ మేదియు కనబడుటలేదు. అదొక పారంపర్యా చారమే. అయితే రోమాలో యున్న పోపులందరి ఘనతకు, దోష సహితత్వ ఆరోపణలకు యిది మాత్రమే ఆధారమై యున్నది.

సీమోను పేతురు రోమా పట్టణపు మొదటి బిషప్పు కాదనియు, సంఘ శిరస్సు కాదనియు నిరూపించుకొనుట కొరకు ఈ దిగువ వాస్తవములను గమనించుము: 1) పేతురు రోమాలో పోపుగా యుండెనని వినబడుచున్న క్రీ॥శ॥ 44వ సంవత్సరములో అతడు యెరూషలేములో యుండెను (అపొ. కా. 12). 2) పౌలు కొరింథు నుండి రోమీయులకు పత్రికను వ్రాసినప్పుడు క్రీ॥శ॥ 53 లో పేతురు రోమాలో లేడు. ఆ పత్రికలో పేతురు అక్కడ ఉన్నట్లేమియు చెప్పబడలేదు. ఇరవై ఏడుగురు క్రైస్తవులకు శుభమని చెప్పిన తరువాత పౌలు పోపును మరచి యుండడుగదా? 3) కొన్ని సంవత్సరముల తరువాత పౌలు ఒక ఖైదీగా రోమాకు వెళ్లి అక్కడ రెండు సంవత్సరము లుండెను. అ సమయములో అతడు కొలస్సయులకు, ఫిలేమోనుకు, ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు పత్రికలను వ్రాసెను. ఈ ఒక్కొక్క పత్రికలో అతడు అనేకులను గూర్చి వ్రాసినను పేతురు గూర్చి అతడేమియు వ్రాయ లేదు. పేతురు గనుక పోపు అయిన యెడల పౌలు అతనిని మరల నిర్లక్ష్యము చేసెనా? 4) తరువాత పౌలు రోమా నుండి తిమోతికి రెండవ పత్రికను వ్రాసెను. అయినను ఆ పట్టణములో పేతురు యొక్క ఉనికిని గూర్చి దానిలో ఏమియు చెప్పబడలేదు. అందరు అతనిని విడచి వెళ్ళిరిగాని లూకా మాత్రమే తనయొద్ద ఉన్నాడని పౌలు చెప్పెను (2 తిమో 4:11). పేతురు ఎక్కడున్నాడు? మరణ గడియలో అతని సందర్శించుటకు పోపు భయపడెనా? 5) పేతురు వ్రాసిన రెండు పత్రికలలోను అతడు రోమాలో నివసించినట్లు ఏమియు చెప్ప

బడలేదు. సరిగదా దానికి తూర్పుగాయున్న బబులోనులో అత డుండెను (1 పేతురు 5:13). 6) ఆత్మ ప్రేరిత లేఖకుడెవడును పేతురు రోమాలో యున్నట్లు ఎన్నడు చెప్పలేదు. అయితే ఎప్పుడైనా భూగర్భ పరిశోధనలనుబట్టి పేతురు రోమాలో చనిపోయెనని నిరూపించగలిగిన యెడల, అక్కడనుండి సంఘ శిరస్సుగా అతడు పరిపాలించెనని రోమా పట్టణ బిషప్పులు అతని స్థానము నలంకరించువారని, సంఘ శిరస్సులని, రక్షణ పొందుటకు ప్రజలు రోమాలోని పోపుకు లోబడవలెనని చేయు ఆరోపణలు మాత్రము ఇంకను లేఖనములలో ఆధారములేనివి గానే యుండును.

సర్వాధికారమును కలిగి సార్వజనిక సంఘ శిరస్సుగా క్రీస్తు మాత్రమే యున్నాడు; ఆయన పరమందు నిత్యము జీవించును. క్రీస్తు సంఘ ప్రధాన కార్యాలయము పరమందే యున్నది. ఆయన సంఘమునకు భూమిమీద ప్రధాన కార్యాలయమేమియు లేదు (ఫిలిప్పీ 3:20)

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఇహ పరములయందు ఆయనకు సర్వాధికారము కలదని చెప్పెను (మత్తయి 28:18). సంఘమునకు భూమిమీద ఒకరును పరలోకములో ఒకరును శిరస్సుగాలేరు. దృశ్యాదృశ్య శిరస్సులతో సంఘము దృశ్యాదృశ్యముగా యుండునని చెప్పువారు బైబిలులో లేనిపదముల నుపయోగించుచున్నారు. క్రీస్తు సంఘముపై అధికారిగా యుండు తరుణము భూమిమీద ఎవనికి ఈయబడ లేదు. సరిగదా ఒక మానవునికి ఆయన సంఘమునకు కట్టడలను నియమించు అధికారము ఆయన ఎన్నడు ఈయలేదు. సంఘము క్రీస్తుకు లోబడియుండవలెనని బైబిలు బోధించుచున్నది. (ఎఫెసీ 5 : 24). గనుక పొరపాట్లు చేయగల మానవ మాత్రుడెవడును ప్రభువు సంఘమునకు శిరస్సుగా లేడు.

## మొదటి పోపు ఎప్పుడు ఆవిర్భవించెను ?

“పోపు” అను పదమునకు తండ్రియని అర్థము. యేసు ఇట్లనెను:

"భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు" (మత్తయి 23 : 9; కీర్తన 111:9).

అన్ని రకములైన మత సంబంధ బిరుదులను, దుస్తులను ప్రభువు ఖండించెను. నేను ఘనుడను, నీవు అల్పుడవు అనే భావము పోపులగుటకు దారి తీసెను. అయితే అపొస్తలులు చనిపోయిన కొన్ని వందల సంవత్సరముల వరకు పోపులు ఉద్భవించలేదు. చరిత్ర ప్రకారము ఈనాడు "పోపు" అనబడే బిరుదు ఈ దిగువ రీతిగా ఆవిర్భవించెను: క్రీ॥శ॥ 533 లో రోమాలో యున్న బిషప్పునకు జస్టీనియన్ అనునతడు "సంఘ ప్రభువు" అనే బిరుదు నిచ్చెను. క్రీ॥శ॥ 533 లో కాన్‌స్టాంటినోపిల్‌లో బిషప్పుగా యున్న జాన్ ది ఫాస్టర్ అను నతడు సంఘపు సార్వజనిక బిషప్పు (Universal Bishop) అనే బిరుదును తనకు తానే ధరించుకొనెను. అతడా పని చేసినందుకు రోమా బిషప్పయిన గ్రెగరీ ది గ్రేట్ అతనిని తీవ్రముగా ఖండించెను. అయితే కొన్ని సంవత్సరములు గడచిన తరువాత ఫోకస్ అను బహు రక్తదాహముగల రోమాచక్రవర్తి ఆ బిరుదును క్రీ॥శ॥ 606 లో బోనిఫేస్ III అనునతనికి ధరింప జేసెను. నాటినుండి నేటి వరకు రోమా బిషప్పులందరు ఒకరి తరువాత మరొకరు ఆ బిరుదును ధరించుకొనుచు యున్నారు. మొదటి ఆరు శతాబ్దములలో జరిగిన సంఘ సభల తీర్మానములను అన్నిటిని పరిశీలించి చూచిన, పోపుయొక్క ఉనికిని గూర్చి గాని, సార్వజనిక బిషప్పును గూర్చి గాని గ్రెగరీ ది గ్రేట్ లేక జాన్ ది ఫాస్టర్ కాలము వరకు కనుగొనలేము. సార్వజనిక సంఘ శిరస్సు అనే బిరుదును జాన్ ది ఫాస్టర్ మొదట ధరించుకొనెను. అయితే అప్పటికి రోమాలో యున్న బిషప్పు అది లేఖన విరుద్ధ మని క్రైస్తవ్య విరుద్ధ మని, దయ్యముల సంబంధమైనదని దానిని వ్యతిరేకించెను.

సంఘ చరిత్రను బాగుగా పరిశీలించిన, రోమన్ కేథలిక్కు-సంఘపాలన క్రొత్త నిబంధనను బట్టిగాక పురాతన రోమా సామ్రాజ్య ప్రభుత్వ మాదిరిని బట్టి యున్నదని, అది సత్యము నుండి క్రమముగా భ్రష్టత్వములో పడుటవలన సంభవించెనని విశదమగును (2 థెస్స 2).

పోపుల మతాధికారము మూడు ఊహాలపై నిలచి యున్నది:

1) సంఘములో పేతురు సర్వాధికారమును. కలిగి యుండె ననునది.

2) పేతురు రోమా పట్టణపు మొదటి బిషప్పు లేక పోపు అనునది.

3) పేతురుకున్న ప్రత్యేక శక్తి అతడు మరణించగా అతని స్థానము నలంకరించిన వానికి, తరువాత అందరికి అందించబడె ననునది. అయితే ఈ ఊహాలన్నియు అబద్ధములే, గనుక బైబిలు బోధను బట్టి సంఘము యొక్క అధికారమును గూర్చి యున్న అరోపణలన్నియు దోషభరితమైన పునాదిపై ఆధారపడి యున్నవని బయల్పడినది.

—పెర్రి బి. కోతమ్

## నిత్యము నిలుచునవి
### *(Indestructibles)*

**1. దేవుడు :** "ఆదియందు నీవు భూమికి పునాది వేసితివి, ఆకాశములు కూడ నీ చేతిపనులే. అవి నశించునుగాని నీవు నిలచి యుందువు. అవియన్నియు వస్త్రమువలె పాతగిల్లును. ఒకడు అంగ వస్త్రమును తీసివేసినట్లు నీవు వాటిని తీసివేయుదువు అవి మార్చబడును నీవు ఏకరీతిగా నుండువాడవు. నీ సంవత్సరములకు అంతములేదు". (కీర్తన 102:25-27).

**2. యేసుక్రీస్తు :** "యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటేరీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటేరీతిగా యుండును" (హెబ్రీ 13:8). మనము క్రీస్తుతో కూడ చనిపోయినయెడల, మృతులలోనుండి లేచిన క్రీస్తు ఇకను చనిపోడనియు, మరణమునకు ఇకను ఆయనమీద ప్రభుత్వము లేదనియు ఎరిగి, ఆయనతో కూడ జీవించుదుమని నమ్ముచున్నాము." (రోమా 6:8, 9).

**3. బైబిలు :** "సర్వశరీరులు గడ్డియై యున్నారు. వారి అందమంతయు అడవి పువ్వువలె ఉన్నది. యెహోవా తన శ్వాసను దాని మీద ఊదగా గడ్డి యెండును పువ్వువాడును. నిశ్చయముగా జనులు గడ్డివంటివారే. గడ్డి యెండిపోవును, దాని పువ్వువాడిపోవును. మన దేవుని వాక్యము నిత్యము నిలుచును" (యెషయా 40:7,8).

**4. క్రీస్తు రాజ్యము :** "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవ కృపకలిగి యుందము. ఆ కృపకలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము, ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు" (హెబ్రీ 12 : 28. 29).

యేసుక్రీస్తు ద్వారా బైబిలునందు బయలు పరచబడిన దేవుని చిత్తమునకు లోబడి దేవునికి అప్పగింపబడబోవు రాజ్యములోనికి జన్మించెదముగాక! (యోహాను 3:3-5; 1 కొరింథీ 15:24).

— చార్ల్స బేక్

---

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA-533 001

BOOK-POST
Printed Book only

To
..............................
..............................
..............................
..............................